



అడవి పందులు నాశనం చేసిన మొక్కజొన్న పంట

జాగరణమే

- మొక్కజొన్నకు అడవి పందుల బెడద
- రాత్రిళ్లు పొలాల్లోనే అన్నదాతలు
- ఏటా తప్పని నష్టాలు
- నియంత్రణపై దృష్టి సారించని అధికారులు

ఆరుగాలం కష్టపడే అన్నదాతలకు కష్టాలు వెంటాడుతూనే ఉంటాయి. అతి, అనావృష్టియే కాదు.. జంతువులతో సైతం ప్రమాదాలు పొంచి ఉన్నాయి. నిత్యం కష్టపడి పంటలు పండిస్తే అటవీ జంతువులు వాటిని నాశనం చేస్తున్నాయి. ముఖ్యంగా నల్లమల అటవీ సమీప గ్రామాల్లో రైతులు మొక్కజొన్నను విస్తారంగా పండించారు. పంట చేతికొచ్చే సమయం ఆసన్నమైంది. ఇలాంటప్పుడే మొక్కజొన్న పైరుపై అడవి పందులు దాడి చేస్తున్నాయి. పొలాల్లోకి ప్రవేశించి కంకి దశలో ఉన్న మొక్కజొన్నను నమిలేస్తున్నాయి. అడవి పందుల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు రైతన్న రాత్రిళ్లు జాగరణ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రత్యేకంగా కూలీలను ఏర్పాటు చేసుకొని పొలాల్లో భారీ శబ్దాలు చేస్తూ పందులు రాకుండా రాత్రంతా పహారా కాస్తున్నాడు. అడవి పందులను నియంత్రించాల్సిన అటవీ శాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆత్మకూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అడవి పందుల బెడదతో ప్రతి రోజూ జాగరణం చేయాల్సి పరిస్థితులు నెలకొన్నాయి. నల్లమల అటవీ సమీప గ్రామాల రైతులు అడవి పందుల బెడదతో అల్లాడిపోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకున్న మొక్కజొన్న పొలాల్లోకి రాత్రి వేళల్లో అడవి పందులు ప్రవేశించి బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. కష్టపడి పండించిన పంటలు నష్టపోతున్నారు. ఆత్మకూరు వ్యవసాయ డివిజన్‌లో ఖరీఫ్ సీజన్‌లో భాగంగా 18,457 హెక్టార్లలో మొక్కజొన్న పంటను రైతులు సాగుచేశారు. ఆత్మకూరు మండలంలో 4,289, పాములపాడులో 7,015, కొత్తపల్లిలో 6008, వెలుగోడు మండలంలో 1,145 హెక్టార్లలో మొక్కజొన్న సాగైంది. ప్రస్తుతం పైరు కంకిదశలో ఉంది. ఈ పరిస్థితుల్లో అడవి పందులు పొలాల్లోకి ప్రవేశించి కంకి దశలో ఉన్న మొక్కజొన్నను నమిలేస్తూ నాశనం చేస్తున్నాయి. పంట పొలాల్లోకి అడవి పందులను రానివ్వకుండా చర్యలు చేపట్టాలని అటవీ అధికారుల వద్ద బాధిత రైతులు మొరపెట్టుకున్నారు. అయినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. రైతులే స్వయంగా అడవి పందుల నియంత్రణకై రక్షణ చర్యలు చేపడితే అటవీ చట్టాల ప్రకారం కేసులను నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొలాల్లో కేకలు వేస్తూ..

పైరు చేతికొచ్చే సమయంలో అడవి పందులతో పంటలు నాశనమవుతున్నాయి. అన్నదాతలు చూడలేక ప్రతి రోజు కూలీలను జతచేసుకుని రాత్రంతా పొలాల్లో కేకలు వేస్తూ పంటను కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు. అడవి పందులు పొలాల్లోకి రాకుండా ఉండేందుకు భారీ శబ్దం వచ్చే టపాకాయలను కాలుస్తున్నారు. ఈ ఖర్చులు కూడా రైతులకు అదనపు భారం పడుతోంది. నాసిరకం చీరలను కొనుగోలు చేసి పంట చుట్టూ రక్షణ కవచంలా ఏర్పాటు చేసుకున్నప్పటికీ అడవి పందులు వదలడం లేదు. వీటి వల్ల కొంతమేర ఉపయోగం ఉన్నప్పటికీ ఎలాగోలా పొలాల్లోకి ప్రవేశించి నాశనం చేస్తున్నాయి. ఒకేసారి అడవి పందుల సమూహం పొలంలోకి ప్రవేశించి పంటనంతా.. తొక్కాతొక్కి నాశనం చేస్తున్నాయి. దీంతో చేతికొచ్చే పైరంతా నేలవాలి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి.



మొక్కజొన్న పంటను నాశనం చేస్తున్న అడవి పందులు

ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు

ఎక్కడైనా అడవి పందిని చంపితే అందుకు గల కారణాలను అన్వేషించి సంబంధిత వ్యక్తులపై అటవీ శాఖాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. పొలాల్లోకి అడవి పందులు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అడవుల్లో అడవి పందులకు సరైన ఆహారం లేకపోవడంతో అవి దారిమళ్లి పొలాలను నాశనం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా వుంటే అడవి పందుల ధాటికి నష్టపోయిన రైతులకు పరిహారం కూడా నామమాత్రంగానే ఇస్తున్నారు. ఈమొత్తంతో కనీసం పరిహారం కోసం దరఖాస్తు చేసుకునే ఖర్చులకు కూడా సరిపడటం లేదని బాధిత రైతులు చెబుతున్నారు. అటవీ సమీప గ్రామాల్లో అటవీ ప్రాంతానికి కంచెను ఏర్పాటు చేస్తే.. అడవి పందుల నుంచి పంటను కాపాడుకోవచ్చునని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అటవీ అధికారులు స్పందించి అడవి పందుల వల్ల పంటల నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అడవి పందుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు పైరు చుట్టూ చీరలతో కంచె ఏర్పాటు చేసిన దృశ్యం

నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించం: జేసీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో గడువులోగా పరిష్కారం కాకుండా రీ ఓపెన్ అయిన అర్జీలపై మరింత దృష్టిసారించి పరిష్కరించాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. నంద్యాల కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా సోమవారం జేసీ ప్రజల నుంచి వచ్చిన 248 అర్జీలను స్వీకరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. సమస్యలపై పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా, రీ ఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. కిందిస్థాయి సిబ్బంది పై ఆధారపడకుండా స్వయంగా అధికారులే బాధితులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు.

బాధితులకు న్యాయం : ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల టౌన్ సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 128 ఫిర్యాదులు వచ్చాయని, విచారించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎటువంటి సమస్యలైన చట్ట పరిధిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఎక్కువగా కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేయడం, పొలం తీసుకుని డబ్బులు ఇవ్వకపోవడం తదితర సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు 8,011 క్వింటాళ్ల ఉల్లి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుకు సోమవారం 8,011 క్వింటాళ్ల ఉల్లిగడ్డలను రైతులు అమ్మకానికి తెచ్చారని మార్కెట్ సెక్రెటరీ జయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇందులో 4,978 క్వింటాళ్లను వ్యాపారులు కొనగా మిగిలిన 3,033 క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిందన్నారు. ఎప్పటికప్పుడు ఉల్లిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలకు క్వింటానికి రూ.1,200 మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి రైతుకు ఈ ధర అందుతుందని , రైతులు ఆందోళన చెందొద్దు అన్నారు. రైతులు గ్రామాల్లోనే ఉల్లిగడ్డలను క్లీన్ చేసి యార్డుకు తెస్తే ఉల్లి పాడుకాకుండా ఉంటుందని సూచించారు. తక్కువ సమయంలోనే అమ్మకాలు జరుగుతాయని, రైతులు తమ సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

బాలల చట్టాల పరిరక్షణకు కృషి చేయాలి

- అధికారులకు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది సూచన



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలల రక్షణ చట్టాల అమలుపై అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుని వారి అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది సూచించారు. బాలల న్యాయం, రక్షణ చట్టాల అమలుపై సోమవారం స్థానిక లోక్ అదాలత్ భవనంలో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలల రక్షణ కేసులను నిర్వహించే పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అవసరమని తెలిపారు. పోలీసులు, బాలల హక్కుల పరిరక్షణ విభాగాలు సమన్వయం చేసుకుని బాలల కేసులు సత్వరంగా పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. పోక్సో కోర్టు న్యాయాధికారి రాజేంద్రబాబు మాట్లాడుతూ పిల్లలపై లైంగిక వేధింపుల కేసులను త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, బాలలు ద్వితీయ శ్రేణి బాధితులుగా మారకుండా చూడాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ బాలల ప్రయోజనాల కోసం అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక చైల్డ్ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. జువైనల్ జస్టిస్ బోర్డు న్యాయాధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ జువైనల్ జస్టిస్ బోర్డు ముందు చట్టానికి విరుద్ధంగా ఉన్న బాలలను నిర్ణీత వ్యవధిలోగా హాజరు పరిచేలా చూడాలన్నారు. బాలల వయస్సు నిర్ధారణలో జాప్యం లేకుండా చేస్తే కేసులను త్వరగా పరిష్కరించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాధిక, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ జుబేదా బేగం, ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించిన పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోండి

- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల
- మార్కెట్ యార్డులో రైతులకు ఓదార్పు
- కనీస మద్దతు ధర రూ.2,500 ప్రకటించాలి



కర్నూలులో మహిళా రైతుతో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

కర్నూలు/ కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా రైతులకు అండగా ఉంటానని ఆమె భరోసానిచ్చారు. సోమవారం కుమారుడు రాజారెడ్డితో కలిసి హైదరాబాద్ నుంచి బయలుదేరిన షర్మిల కర్నూలులోని మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లా నుంచి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఉమ్మడి కర్నూలు డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మినరసింహ యాదవ్‌తో కలిసి ఆమె ఉల్లి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉల్లి రైతుల బాధలను అర్థం చేసుకోవాలని, కనీస మద్దతు ధర రూ.2,500 ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉల్లి రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, పెట్టుబడి ఎకరాకు రూ.లక్షకు పైగా అయితే సగం కూడా చేతికి రావడం లేదని రైతులు కన్నీరు పెడుతున్నారు. ధరలు పతనమై, కూలీ, రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కాక తాము పడుతున్న ఇబ్బందులను రైతులు వివరించారు. కూటమి ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వడం లేదని రైతులు చెబితే ఇక్కడే నిరాహారదీక్ష చేస్తానని అన్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.1200లు ప్రకటించింది. ఏ వ్యాపారి కూడా ఆ రేటుకు కొనడం లేదని, వ్యాపారి కొనే ధరపైన వ్యత్యాసం ఉన్న నగదును ఖాతాల్లో జమ చేస్తామని జాయింట్ కలెక్టరు వచ్చి చెప్పారు. ఆ డబ్బు వస్తుందో రాదో అని రైతుల్లో భయం ఉందని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలని, వ్యత్యాసం అమౌంట్ ఖాతాల్లో జమ చేయడంతో పాటు గిట్టుబాటు ధర రూ.1200లు ప్రకటించాలని షర్మిల డిమాండ్ చేశారు.

మిగతా 7వ పేజీలో

మహానందిలో సంప్రోక్షణ



మహానందిలో సంప్రోక్షణ చేస్తున్న వేదపండితులు

మహానంది, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం ఉదయం సంపూర్ణ చంద్రగ్రహణం పూర్తయ్యాక ప్రధాన ఆలయాల్లో సంప్రోక్షణ పూజలు వేదపండితులు నిర్వహించారు. గ్రహణం సందర్భంగా ఆదివారం మూసివేసిన ఆలయం తలుపులను సంప్రోక్షణ ముగిసిన తర్వాత తెరిచారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, ప్రాతకాల కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు.

భవితకు భరోసానిచ్చేలా పాలన

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



బనగానపల్లె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గడిచిన 15 నెలల కూటమి పాలన భవితకు భరోసానిచ్చేలా సాగిందని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఆర్థిక కష్టాలను దాటి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశామన్నారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా కేంద్రంలో ఈనెల పదో తేదీన జరిగే సూపర్ సిక్స్ సక్సెస్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఆర్థికంగా అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైసీపీ అన్నదాత పోరుకు రైతుల నుంచే స్పందన కరువైందన్నారు. నాడు రైతు పంట బీమాకు ఎగనామం పెట్టి నేడు వైసీపీ నీతులు చెబుతోందని విమర్శించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందన్నారు. దీంతో వైసీపీ నాయకులకు గుబులు మొదలైందన్నారు. యూరియాను కొందరు అవసరానికి మించి కొనుగోలు చేయడంతో క్షేత్రస్థాయిలో యూరియా కొరతకు కారణమైందన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు ఆస్కారం లేకుండా తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోదన్నారు. ప్రస్తుతం 1,200 క్వింటాళ్ల ఉల్లిని కూటమి ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. వైసీపీ నాయకులు ఏపీలోని వైద్యశాలలు ప్రైవేటీకరణ చేస్తున్నట్లు వదంతులు పుట్టిస్తున్నారన్నారు.

ఉద్యోగులు మెరుగైన సేవలందించాలి

- ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు తక్షణమే చేపట్టండి
- 'సూర్యఘర్'ను ప్రజలకు చేరువ చేయాలి
- ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావ్
- విద్యుత్ ఉద్యోగుల చైతన్య సదస్సు



మాట్లాడుతున్నఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావ్

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోషరావ్ అన్నారు. సోమవారం సాయంత్రం నంద్యాల ఎల్‌కేఆర్ ఫంక్షన్‌హాలులో విద్యుత్ ఉద్యోగుల చైతన్య సదస్సు నిర్వహించారు. నంద్యాల విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈసదస్సుకు సీఎండీతో పాటు డైరెక్టర్ గురువయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ప్రత్యేకించి దృష్టి సారించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో విద్యుత్ పంపిణీలో నష్టాలు, అంతరాయాలు, త్రీఫేస్ కరెంట్, అమరికలు, సూర్యఘర్, ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏబీ స్విచ్ బిగింపులు వంటి పలు అంశాలపై విద్యుత్ ఉద్యోగులకు చైతన్యం కలిగించారు. గ్రామీణ ప్రాంతాల్లో త్రీఫేజ్ కరెంటు సరఫరా చేయడంతో ఆ గ్రామాల అభివృద్ధితో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి గణనీయంగా ఉంటుందన్నారు. ఆర్‌డీఎస్ స్కీమ్ కింద గ్రామాల్లో కరెంటు సరఫరాకు అయ్యే ఖర్చులో కేంద్రం 70 శాతం, రాష్ట్రం 30 శాతం భరిస్తుందన్నారు

మిగతా 7వ పేజీలో



హాజరైన నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ టెక్నికల్ సిబ్బంది

'ఓపి'క పోతోంది!

- విజృంభిస్తున్న జ్వరాలు
- కర్నూలు సర్వజన ఆసుపత్రిలో కిక్కిరిసిన రోగులు
- ఒక్కరోజులోనే 3,291 మందికి ఓపీ



7

భర్త హత్యకేసులో భార్య, ప్రియుడు అరెస్టు

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలు

6

- వైసీపీ నాయకులపై మంత్రి భరత్ ధ్వజం

'కళా ఉత్సవ్' పోస్టర్ ఆవిష్కరణ



డైట్ కళాశాలలో పోస్టరును విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన కర్నూలు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ ఘనంగా నిర్వహిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ డా.అయూబ్ హుస్సేన్ తెలిపారు. ఈ కళా ఉత్సవ్ సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళా ఉత్సవ్ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే వేదికగా మాత్రమే కాకుండా వారి సృజనాత్మకత, సాంస్కృతిక విలువలను పెంపొందించే పండుగా నిలుస్తుందన్నారు. సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం వంటి విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9, 10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ ఉత్సవ్‌లో పాల్గొంటారని చెప్పారు. వారిలో విజేతలైన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం పొందుతారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ జీజీ మధు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న 11 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు సంబంధించిన 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోకారి డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్టీయూ భవన్‌లో సోమవారం ముఖ్య నాయకుల సమావేశం రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు బి.సుంకన్న అధ్యక్షతన జరిగింది. గోకారి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. పెండింగ్ కరువు భత్యాల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57 ప్రకారం 2004 కన్నా ముందు నోటిఫికేషన్ విడుదలై పరిపాలన కారణాల వల్ల తర్వాత నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 12 నెలల పూర్తి జీతం చెల్లించి దశలవారిగా వారిని రెగ్యులర్ చేయాలన్నారు. అలాగే పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు నారాయణస్వామి, ఉల్లప్ప, మధుసూదన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ బాధితులకు న్యాయం చేయండి

- ఉప లోకాయుక్త ఆదేశం

కర్నూలు లీగల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఖాతా నుంచి అక్రమంగా జీపీఎఫ్ మొత్తాన్ని మళ్లించుకుని స్వాహాచేసిన వ్యక్తులపై కేసుపెట్టి బాధితులకు న్యాయం చేయాలని రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని ఆదేశించారు. ఫిర్యాదిదారులైన జి.జయభారతి, డి.రామసంజన్న పదవీ విరమణ చేసిన తర్వాత జీపీఎస్ మొత్తం కోసం దరఖాస్తు చేసుకు న్నారు. జూనియర్ అసిస్టెంట్ ఏ.ప్రవేష్‌కుమార్ కొంతమంది వ్యక్తులతో కుమ్మక్కై బాధితుల జీపీఎఫ్ మొత్తాన్ని అక్రమంగా వేరే ఖాతాలకు మళ్లించుకుని దాదాపు రూ.18 లక్షలు స్వాహాచేశారు. దీంతో బాధితులు ఉప లోకాయుక్తను ఆశ్రయించారు. అక్రమా ర్కులపై విచారించి క్రిమినల్ కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని ఉప లోకాయుక్త గతంలో ఆదేశించింది. ఈమేరకు అధికారులు స్పందించి బాధితుల జీపీఎఫ్ మొత్తాన్ని 7.1 శాతం వడ్డీతో చెల్లించడానికి అంగీకరించింది. అక్రమాలకు పాల్పడిన అనంతపురంలోని హెచ్‌ఎల్‌సీ అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కే.వెంకట రమణారెడ్డి, ఏ.వెంకట సురేష్‌బాబు, ఉస్మాన్, సుబ్రహ్మణ్యం, ఏ.ప్రవేష్ కుమార్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అధికారులు లోకాయుక్తకు తెలియజేశారు. భవిష్యత్తులో జీపీఎఫ్ ఉపసంహరణ, తుది చెల్లింపు చేసే ముందు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అధికారిక పోర్టల్‌లో వారి ఐడీలను వ్యక్తిగతంగా ధ్రువీకరించుకోవాలని ఉప లోకాయుక్త సూచించారు.

మల్లన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి



శ్రీశైల క్షేత్రంలో జేసీ ప్రభాకర్ రెడ్డి

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం శ్రీశైల క్షేత్రంలో వెలసిన భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేసుకోండి

- జాయింట్ కలెక్టర్ నవ్య



కౌన్సెలింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ నవ్య

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులపై తక్షణ చర్యలు తీసుకునేలా ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టంపై మిషన్ శక్తి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రి-మారిటియల్ కౌన్సెలింగ్ సెంటర్‌పై అవగాహన కల్పించే పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల బాధ్యత అన్నారు. వివాహానికి ముందు జంటలు తమ సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి ఈ కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఐసీడీఎస్ పీడీ విజయ పాల్గొన్నారు.

జిల్లా అంధత్వ నియంత్రణ ప్రోగ్రాం మేనేజర్‌గా డాక్టర్ హిమబిందు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నియంత్రణ ప్రోగ్రాం మేనేజర్ (డీపీఎం)గా నంద్యాలకు చెందిన సివిల్ సర్జన్ స్పెషలిస్టు డాక్టర్ హిమబిందును నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కేటీ కృష్ణబాబు ఆదేశాలు జారీ చేశారు. నంద్యాలలో ఎన్‌పీసీపీ కింద పని చేస్తున్న హిమబిందును వైద్య కారణాలపై కర్నూలు డీబీసీఎస్‌కు బదిలీ చేస్తూ నియమించారు. గత ఐదేళ్లుగా కర్నూలు డీబీసీగా పని చేస్తున్న డాక్టర్ సంధ్యారెడ్డి స్థానంలో డాక్టర్ హిమబిందు నియమితులయ్యారు.

పురోగతి పనులు ప్రజలకు కనపడాలి

- రహదారుల విస్తరణలో జాప్యం తగదు
- పార్కుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి
- మున్సిపల్ అధికారుల సమీక్షలో మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధి పనుల్లో ఏ మాత్రం జాప్యం తగదని, ప్రజలకు ప్రత్యక్షంగా కనపడేలా ప్రగతి పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్‌శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి మున్సిపల్ అధికారులతో మంత్రి టీజీ భరత్ సమీక్ష నిర్వహించారు. ముందుగా గత సమీక్షలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిపై చర్చించారు. బుధవారపేట మెడికల్ కాలేజీ మలుపు, కిడ్స్ వరల్డ్ కూడలి నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు రహదారివిస్తరణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే బాధితులకు పరిహారం అందించే ప్రక్రియను వేగవంతం చేసి రహదారుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వెండర్ జోన్ల ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని, ముందుగా రెడ్ జోన్లలో ఆక్రమణలను నియంత్రించాలని సూచించారు. రాజ్‌విహార్ సమీపంలోని ఎల్లమ్మ గుడి నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు బండ్ రహదారి నిర్మాణ పనులు నిలువరించకుండా కొనసాగించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోరహదారులపై గుర్తించిన 215 గుంతలను అత్యంత వేగంగా పూడ్చాలని ఆదేశించారు. ఎన్‌క్యాప్, సీఎస్ఆర్ తదితర నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ప్రతి ప్రాంతంలో ఒక పార్కును అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని మొండి బకాయిలు విషయంలో ఎలాంటి ఉపేక్ష చూపొద్దని మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డా.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్వో వాజీద్, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా సీమోల్లంఘన మహోత్సవం

- ముగిసిన దీక్షలు
- పీఠాధిపతికి ఘన సన్మానం



పీఠాధిపతిని సన్మానిస్తున్న మఠం ఉద్యోగులు

మంత్రాలయం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సీమోల్లంఘన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి కొండాపురం ఆంజనేయస్వామిని దర్శించుకుని పంచ అశ్వవాహన రథంపై పీఠాధిపతి ఆసీనులై భక్తుల హర్షధ్వానాలు, భక్తిపాటలు, కోలాటాల మధ్య ఘనంగా ఊరేగారు. పీఠాధిపతి జూలై 22వ తేదీన చతుర్మాస దీక్షలు ప్రారంభించి సెప్టెంబర్ 8వ తేదీ వరకు 49 రోజుల పాటు దీక్షలు కొనసాగించారు. ఈ దీక్షల్లో 60 ఉపన్యాసాలు, 20 సంగీత కచేరీలు నిర్వహించారు. దీక్ష విరమణలో భాగంగా శ్రీమఠం ఎంప్లాయీస్ యూనియన్, విజయ విఠల్, ఎంటీఆర్, నదీతీరం షాపింగ్ కాంప్లెక్స్‌ల వారు పీఠాధిపతిని మహాముఖద్వారం నుంచి రాఘవేంద్రసర్కిల్ వరకు పూల వర్షం కురిపిస్తూ ఊరేగించారు. ఉదయం నుంచి రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేసి, మూలరాములకు కనకాభిషేకం చేసి పీఠాధిపతులు హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు సీతారామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పన్నగ వెంకటేశ్ స్వామి, పూజారి వ్యాసరాజాచార్, మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి, రాజాఎస్ అప్రమేయాచార్, మేనేజర్లు శ్రీపతాచార్, ఐపి నరసింహమూర్తి, డీఎం ఆనందరావు, గౌతమాచార్, ఆనందతీర్థాచార్, సుజయీంద్రా చార్, రమణారావు, వాదిరాజాచార్, ఏఈ బద్రినాథ్, హరినాథాచార్, మంచాల పద్మనాభాచార్, జేపీ స్వామి, వ్యాసరాజాచార్, హనుమేషాచార్, ప్రకాషాచార్, ద్వారపాలక అనంతస్వామి ఉన్నారు.

ఘనంగా సత్కరించి..

సీమోల్లంఘనలో భాగంగా శ్రీమఠం ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ మేనేజర్ సురేష్ కోనాపూర్, రవి కులకర్ణి, ఐపి నరసింహమూర్తి, జేపీ స్వామి, విజేంద్రాచార్ పీఠాధిపతులకు ఘనంగా సత్కరిచారు. అనంతరం పుష్పాభిషేకం చేసి పట్టువస్త్రాలు బహూకరించారు. ఈ ఊరేగింపులో టీటీడీ దాససాహిత్య భజన మండళ్ల ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచారు. భక్తులనుద్దేశించి పీఠాధిపతి మాట్లాడారు. 13వ చతుర్మాసదీక్షలు రాఘవేంద్రస్వామి ఆశీస్సులతో దిగ్విజయంగా పూర్తి చేశామని, దేశ ప్రజలంతా సస్యశ్యామలంగా, సుఖశాంతులతో, ప్రశాంతంగా ఉండాలని రాఘవేంద్రస్వామికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలు

- వైసీపీ నాయకులపై మంత్రి భరత్ ధ్వజం



పోర్టల్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ధ్వజమెత్తారు. నగరంలోని తనిష్క్ ఫంక్షన్ హాలులో సోమవారం పరిశ్రమల శాఖ ఏర్పాటు చేసిన సులభతర వాణిజ్య కార్యక్రమం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)సమావేశంలో కర్నూలు, నంద్యాల కలెక్టర్లు రంజిత్‌బాషా, రాజకుమారీలతో కలిసి నిరుద్యోగులకు కేరీర్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు సంబంధించి అన్ని నోటిఫికేషన్స్ అందుబాటులో ఉండేలా రూపకల్పన చేసినట్లు తెలిపారు. గతంలో పరిశ్రమల వర్గాలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పారిశ్రామిక వర్గాలకు స్వాతంత్ర్యం వచ్చిన అనుభూతి ఉందని తెలిపారు. 2018లో దావోస్‌లో అర్సలర్ మిట్టల్ కంపెనీ ఒరిస్సా రాష్ట్రానికి వెళ్లి పెట్టుబడులు పెడతామని చెప్పారని, ప్రస్తుతం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చొరవ వల్ల మిట్టల్ కంపెనీ రాష్ట్రానికి వస్తోందని చెప్పారు. గత టీడీపీ హయాంలో జయరాజ్ ఇస్పాత్ పరిశ్రమకు భూమి పూజ చేయగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటే వైసీపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా జగన్ పత్రికలో పారిశ్రామికవేత్తలకు భూకేటాయింపులపై ఇష్టానుసారంగా వార్తలు రాస్తున్నారని, 15 నెలల్లో రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తోనే ఇది సాధ్యమైందని అన్నారు. వైసీప హయాంలో పారిశ్రామికవేత్తలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. ఆలీప్ కంపెనీ ద్వారా ఎన్నో వేల మందికి ఉద్యోగాలు దక్కాయని, ఇవేమి పట్టించుకోకుండా పని కట్టుకొని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహ బాలసదరంలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఖాళీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయ ఓ ప్రకటనలో తెలిపారు. శిశు గృహంలో ఖాళీగా ఉన్న కాంట్రాక్టు పద్ధతిలో సోషల్‌వర్కర్ కమ్ ఎర్లీ చైల్డ్ హెడ్ కం ఎడ్యుకేట్ (1), ఆయా-2 (ఈడబ్లూఎస్-1, ఓసీ(డబ్లూ)-1) పత్తికొండ బాలసదరంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కుక్-1 (ఈడబ్లూఎస్-1- ఓసీ-డబ్లూ), వెల్ఫేర్ కమ్ నైట్ వాచ్‌మెన్ -1 (ఎస్సీ డబ్లూ), పార్ట్‌టైం పద్ధతిలో ఎడ్యుకేట్-1 (ఓసీ డబ్లూ), ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజికల్ టీచర్-1 (ఎస్సీ డబ్లూ), ఇన్‌స్పెక్టర్ కమ్ యోగా టీచర్-1 (ఓసీ డబ్లూ) బాలసదరం పెద్దపాడులో ఇన్‌స్పెక్టర్ కమ్ యయోగా టీచర్-1 (ఎస్సీ-డబ్లూ) (పార్ట్ టౌం) నియామకాల కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వికలాంగుల అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్‌లోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాయలం రూం.నెం.122లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. వివరాల కోసం కర్నూలు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌ను గానీ, కార్యాలయంలో నోటీసు బోర్డును పరిశీలించాలని కోరారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు అవార్డులు



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయినులు

పాణ్యం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పాణ్యం మోడల్ పాఠశాల ఉపాధ్యాయులకు నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఇండియా గ్లోబల్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ మెమోరియల్ ఎక్సలెన్సీ అవార్డులు అందుకున్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ దినేష్‌బాబు మాట్లాడుతూ ఈనెల 7 తేదీన కర్నూలులో నిర్వహించిన కార్యక్రమంలో తనతో పాటు బోటనీ ఉపాధ్యాయిని భారతి, ఎకనామిక్స్ ఉపాధ్యాయిని పర్హానా అవార్డులు అందుకున్నారని చెప్పారు. చదువు, సాంస్కృతిక, క్రీడలు, స్కౌట్, గైడ్స్ తదితర కార్యక్రమాలలో చేసిన సేవలకు అవార్డులు దక్కినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఇండియా గ్లోబల్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాయపాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

విచారించి న్యాయం చేస్తాం: ఎస్పీ



ఫిర్యాదులు వింటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులన్నింటినీ విచారించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. నగరంలోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 99 ఫిర్యాదులు వచ్చాయి. డీఎస్పీ బాబుప్రసాద్, సీఐలు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు

- క్రిష్ణగిరి మండలం కటారుకొండ దగ్గర ఉన్న పులిచెర్లలో ఉన్న 11 ఎకరాల పొలాన్ని ఆక్రమించుకోవాలని పులిచెర్లకు చెందిన దాసరి మధు బెదిరింపులకు పాల్పడుతున్నాడని మంత్రాలయం మండలం చిలకలడోన గ్రామానికి చెందిన మహేశ్ ఫిర్యాదు చేశారు

అనంతపురానికి చెందిన జయచంద్ర బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ఉద్యోగం గానీ, లోన్ గానీ ఇప్పిస్తామని చెప్పి రూ.లక్ష తీసుకుని మోసం చేశారని కర్నూలుకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. తన మొబైల్‌కు పీఎం కిసాన్ పేరుతో ఏపీకే ఫైల్ వచ్చిందని, తన ఫెడరల్ బ్యాంకు ఖాతా నుంచి రూ.55వేలు, యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి రూ.10వేలు మాయం చేశారని కల్లూరు మండలానికి సూర్యనారాయణ ఫిర్యాదు చేశారు. కోడుమూరు రోడ్డులో ఉన్న 18 సెంట్ల స్థలాన్ని మురళీమోహన్, కాంట్రాక్టర్ జాన్ కబ్జా చేశారని, చర్యలు తీసుకోవాలని కర్నూలు షరాఫ్ బజార్‌కు చెందిన వెంకట నారాయణ ఫిర్యాదు చేశారు. ఓ వ్యక్తి తన ఇంటిని ఖాళీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆర్మీలో పని చేస్తూ రిటైర్డు అయిన కర్నూలు మహాలక్ష్మి నగర్ చెందిన జయరామిరెడ్డి ఫిర్యాదు చేశారు. తన ఇల్లు 5 నెలలుగా ఖాళీగా ఉంచానని, తన కుమారుడు ఆర్మీలో పని చేస్తుండడంతో అక్కడికి వెళ్లానని చెప్పాడు. తన ఇంటిలోకి ఓ వ్యక్తి చేరి నివాసం ఉంటూ ఖాళీ చేయడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి



మాట్లాడుతున్న వరలక్ష్మి

కల్లూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, సంవృద్ధిగా నిల్వలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. సోమవారం కల్లూరు మండలం పర్ల గ్రామంలో సిటిజన్ ఔట్రిచ్ ప్రోగ్రాం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.శ్రీవర్ధన్‌రెడ్డి, కల్లూరు వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, డీఆర్సీ వెంకటరెడ్డి పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి మాట్లాడుతూ యూరియా, నానో యూరియా మధ్య వ్యత్యాసాలను ప్రజలకు వివరించారు. అనంతరం రైతులకు పొలం పిలు స్తోంది, పొలంబడి , ఈ-క్రాఫ్ బుకింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు.

మహిళలు ఉద్యమించాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న అరాచకాలపై ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి నిర్మల పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో సమావేశం నిర్వహించారు. మహిళలపై రోజురోజుకూ అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మహిళలు పోరాటాలకు నడుం బిగించాలన్నారు. సీఐటీయూ నాయకుడు గౌస్‌దేశాయ్ ఉన్నారు. అనంతరం పత్తికొండ ఐద్వా మండల అధ్యక్షురాలిగా అంజినమ్మ, ఉపాధ్యక్షురలిగా జైలమ్మ, ఉమా మహేశ్వరి, కార్యదర్శిగా కృష్ణవేణి, సహాయ కార్యదర్శులు గా పావని, లలితను ఎన్నుకున్నారు.

యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఇక్కడ చదివి ఉద్యోగాలు సాధించడం అభినందనీయం
- జేసీ డాక్టర్ బి.నవ్య



జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్యతో సత్కారం పొందిన యువ ఉద్యోగులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో చదువుకొని ఉపాధ్యాయ, గ్రూప్స్‌లో ఉద్యోగాలు సాధించిన యువతను ఆమె ప్రశంసించారు. శాలువాలతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువత నిత్యం గ్రంథాలయానికి వచ్చి, ఇక్కడ అందుబాటులో ఉన్న పోటీపరీక్షల పుస్తకాలు చదివి ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్క విద్యావంతులైన యువత గ్రంథాలయానికి రావాలన్నారు. లైబ్రరీలో వివిధ విభాగాలను ఆమె పరిశీలించారు. అందుబాటులో ఉన్న పుస్తకాలు, పాఠకుల సంఖ్య, పోటీ పరీక్షల పుస్తకాల వివరాలు, పుస్తకాల కంప్యూటరీకరణ అంశాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ యువత చదువు కునేందుకు అన్నిరకాల పుస్తకాలు అం దుబాటులో ఉంచిన గ్రంథాలయ కార్యదర్శి కె. ప్రకాశ్, ఉద్యోగులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరియన్లు ఎస్ బాషా, పద్మావతమ్మ, నసీమాబీ, రేణుక, ఉప, కార్యాలయ సిబ్బంది ఎస్ మగ్బుల్ బాషా, సుదర్శనం, రాజు, నాగభాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాణ్యం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీలకు పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి నాగకార్తీక్ ఎంపికైనట్లు హెచ్‌ఎం రాములునాయక్ తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 6, 7 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో నాగకార్తీక్ పాల్గొన్నాడు. రాష్ట్రస్థాయిలో ఐదోవ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని, యోగా మాస్టారు ప్రతాపరెడ్డిని ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, పవన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ జట్ల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడాకారుల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అధ్యక్షులు డీవీఈవో సురేష్‌బాబు, ఆర్‌ఐవో లాలెప్ప సోమవారం తెలిపారు. 10న అర్చరీ, షూట్కా, సెపక్‌తక్రా డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో, 11న ఫుట్‌బాల్ ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 12న ఫెన్సింగ్, కురాష్, ఉషూ కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 15న జూడో, కలియరపట్టు, నెట్‌బాల్ కర్నూలు డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో, రైఫిల్ షూటింగ్‌ను కర్నూలు నగరంలో అశోక్ నగర్‌లో ఆర్‌కే అకాడమీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2007 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు పదో తరగతి మార్కుల జాబితాతో ఎంపికలో నేరుగా హాజరు కావచ్చని తెలిపారు. వివరాల కోసం రాఘవేంద్ర 9440864732ను సంప్రదించాలని సూచించారు.

ఓపిక పోతోంది!

- విజృంభిస్తున్న జ్వరాలు
- సర్వజన ఆసుపత్రిలో కిక్కిరిసిన రోగులు
- ఒక్క రోజులోనే 3,291 మందికి ఓపీ



వేచిచూసి ఆకలవుతోంది, టిఫిన్ చేద్దాం... ఆసుపత్రిలో రోగులు వారి సహాయకులు



దండం సారూ త్వరగా చేయండి..
స్కానింగ్ కేంద్రం వద్ద పడిగాపులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కిటకిటలాడుతోంది. జ్వరాలు, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలతో ఆసుపత్రికి రోగులు బారులుదీరుతు న్నారు. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో వైరల్ జ్వరంతో ప్రజలు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో కర్నూలు జీజీహెచ్ రోగులతో కిక్కిరిసింది. సోమవారం ఓపీకి రికార్డు స్థాయిలో 3,291 మంది (రాత్రి 9 గంటలకు) రాగా, ఇందులో 412 మంది మెడికల్ ఓపీకి, చిన్నపిల్లల ఓపీకి 310 వచ్చారు. ఇందులో మెడికల్ విభాగంలో 56 మంది అడ్మిషన్ పొందగా.. పీడీయాట్రిక్‌లో 60 మంది చిన్న పిల్లలు అడ్మిషన్ పొందారు.

ఉదయం ఓపీ కోసం రోగులు ఆగచాట్లు పడ్డారు. ఓపీ టికెట్ ఇస్తే చాలు వైద్యం అందినట్లేనని కొందరు రోగులు చెప్పడం విశేషం. మేల్ ఓపీ రోగలుకు ఓపీ సులభంగా లభించినప్పటికీ మహిళా రోగులు మాత్రం ఉదయం 11 గంటలైనా ఓపీ చీటీలు దొరకని పరిస్థితి నెలకొంది. వైద్యాధిదికారుల నిర్లక్ష్యంతో ఓపీ వద్ద మహిళా రోగులు, వృద్దులు ఇబ్బందులు పడ్డారు. జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో సాయంత్రం 5 గంటల వరకు కూడా ఆసుపత్రికి రోగులు వస్తున్నారు.



క్యూలో నిల్చోక తప్పదు మరి.. పరీక్షల రిపోర్టుల కోసం వేచి ఉన్న రోగులు



గందరగోళం.. ఇంతమందిలో మన వంతు ఎప్పుడో..

ఉల్లి రైతులను ఆదుకోండి



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

(5వ పేజీ తరువాయి)

అక్కడి నుంచి హోటల్‌కు చేరుకున్నారు. అక్కడ ఏఐసీసీ సభ్యుడు జె.లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షుడు షేక్ జిలానిబాషా తో సహా పలువురు ముఖ్యనాయకులతో మాట్లాడారు. కర్నూలు డీసీసీ కార్యాలయ వివాదంలో తొలగించబడిన ఆఫీసు సిబ్బంది తమను విధుల్లో తీసుకోవాలని షర్మిలను విన్నవించారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు వైఎస్ షర్మిల, వైఎస్ రాజారెడ్డితో కలిసి ఫొటోలు దిగారు. అనంతరం ఆమె హైదరాబాద్‌కు బయలుదేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానిబాషా, అసెంబ్లీ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు ఎం.ఖాశీంవలి, బి.క్రాంతినాయుడు, మురళీకృష్ణ రాజు, రమేశ్‌యాదవ్, అనంతరత్నం మాదిగ, పుల్లయ్య, గార్లపాటి మద్దిలేటి, తేనే నాగరాజు, బాలు యాదవ్, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శులు దామోదరం రాధాకృష్ణ, చింతల మోహన్ రావు యాదవ్, ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఖాద్రీపాషా, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మారుతిరావు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి మెరుగైన సేవలందించండి

(5వ పేజీ తరువాయి)

. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు ఏర్పడినప్పుడు వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన ఏర్పాట్లను తాము అందించగలమన్నారు.

సూర్యఘర్ కీలక పాత్ర

సంప్రదాయ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా సూర్యఘర్ కీలక పాత్ర వహించనుందన్నారు. రాబోయే తరం సూర్యఘర్‌తోనే సాకారం అవుతుందన్నారు. సూర్యఘర్ ప్రజలను చేరువచేసేందుకు ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత ఉద్యోగులదే అన్నారు. ప్రతి ఉద్యోగి తమవంతు ఆదర్శంగా సూర్యఘర్ ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఆరేళ్లలో ఉచిత విద్యుత్ పొందగలరని వినియోగదారులకు సూచించాలన్నారు. విద్యుత్ పంపిణీలో వినియోగదారుల సంతృప్తి ఇంకా మెరుగుపరుచుకోవాలని సూచించారు. విద్యుత్ పంపిణీలో వినియోగా దారులకు జరుగుతున్న అసౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు సాధన దిశలో పరిష్కారం చేస్తే నూటికి నూరు శాతం ప్రభుత్వం ఆశించినట్లుగా విద్యుత్ శాఖ సేవలందించినట్లేనని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడిసియల్ డైరెక్టర్ గురువయ్య, నంద్యాల జిల్లా విద్యుత్‌శాఖ డీఈలు, ఏడీలు, ఎఈఈలు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- రాష్ట్ర విద్యుత్ శాఖ డైరెక్టర్ గురువయ్య

పాణ్యం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది సాంకేతిక సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలని రాష్ట్ర విద్యుత్ సాంకేతిక శాఖ డైరెక్టర్ గురువయ్య ఆదేశించారు. సోమవారం ఆయన పాణ్యం విద్యుత్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గురువయ్య మాట్లాడుతూ వ్యవసాయానికి నిరంతరం తొమ్మిది గంటల విద్యుత్‌ను అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ కోతలను అరికట్టాలన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, లోవోల్టేజీ సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. విద్యుత్ సామగ్రిని, నిల్వ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ మధుసూదన్, ప్రసాదరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ పరికరాలు పరిశీలిస్తున్న డైరెక్టర్ గురువయ్య

విద్యార్థికి అండగా...

- తానా బోర్డు డైరెక్టర్ పొట్లూరి రవి చేయూత

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ పొట్లూరి రవి కర్నూలు జిల్లాలోని కప్పట్రాళ్ల గ్రామ అభివృద్ధికి, విద్యార్థుల చదువులకు సహాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన విద్యార్థి కె. ఈరన్న ఇంటర్మీడియట్ విద్యాభ్యాసానికి పొట్లూరి రవి రూ.1.50 లక్షల సాయం అందించి కర్నూలులోని మోషన్ రెసిడెన్షియల్ కళాశాల్లో చదివిస్తున్నారు. పొట్లూరి రవి ప్రోత్సాహంతో ఈరన్న ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి 440 మార్కులకు గాను 425 మార్కులు సాధించాడు. ఈరన్న చదువులో రాణించడంపై పొట్లూరి రవి సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు. కప్పట్రాళ్ల గ్రామంలో పదో తరగతిలో టాపర్‌గా వచ్చిన ఈరన్న ఇంటర్మీడియట్ చదువుకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించారు. ఈరన్న మాట్లాడుతూ పొట్లూరి రవి సహాయం మరువలేనిదని, తనలాంటి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆయన ఇస్తున్న ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ కావాలన్నది తన కోరిక అని, కష్టపడి చదువుకుని మెడికల్ సీటు సాధించడానికి కృషి చేస్తానని దీమా వ్యక్తం చేశారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి తనవంతుగా కృషి చేస్తూనే ఉంటానని, సహకరిస్తున్న తానా ఫౌండేషన్ వల్లేపల్లి శశికాంత్‌కు ఈ సందర్భంగా రవి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా విద్యార్థి ఈరన్నను మోషన్ రెసిడెన్సియల్ కళాశాల కరస్పాండెంట్ విజయ్, ముప్పా రాజశేఖర్ తదితరులు అభినందించారు.



పొట్లూరి రవితో కప్పట్రాళ్ల విద్యార్థి ఈరన్న

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన రాగిపోగుల నారాయణకు సోమవారం ఆళ్లగడ్డ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలివీ.. శిరివెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో గ్రామానికి చెందిన నడిపి ఓబులేసు తన స్నేహితులతో కలసి కాలక్షేపం కోసం గ్రామంలోని లింగమయ్య అరుగుపై మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెందిన నారాయణ పాత మనస్పర్థలు మనసులో ఉంచుకొని కత్తితో హత్యాయత్నం చేశాడు. ఈ మేరకు అప్పట్లో పోలీసు అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివప్రసాద్‌రావు కోర్టులో వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో నారాయణకు శిక్ష విధించారు.

భర్త హత్యకేసులో భార్య, ప్రియుడు అరెస్టు

ఆస్పరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రియుడి మోజులో పడి భర్తను హత్య చేసిన కేసులో భార్య, ప్రియుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని తొగల్‌గల్ గ్రామానికి చెందిన గొల్ల అహోబిలం, గొల్ల గంగావతి భార్యాభర్తలు. వీరికి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. ఒక కొడుకు, కుమార్తె ఉంది. జీవనోపాధి కోసం కర్ణాటకలోని యాదగిరి జిల్లా రత్నడిగి గ్రామానికి వలసవెళ్లారు. అక్కడ చెన్నబసవ అనే వ్యక్తితో గొల్ల గంగావతికి తొమ్మిది నెలల క్రితం పరిచయం ఏర్పడింది. వారిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగింది. గంగావతి భర్తను కడతేర్చేందుకు సిద్ధమైంది. ప్రియుడి మోజులో పడి కట్టుకున్న భర్తనే కడతేర్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఈనెల 3వ తేదీన దొడగొండ-తొగల్‌గల్ గ్రామాల మధ్య ప్రియుడితో కలిసి హత్య చేయించినట్లు విచారణలో తేలింది. అహోబిలం హత్య కేసులో నిందితులైన భార్య గంగావతి, ప్రియుడు చెన్నబసవను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



నిందితుల అరెస్టును చూపుతున్న సీఐ గంగాధర్, పోలీసులు

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు.. • మూడు కత్తులు, బైక్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబుప్రసాద్, పోలీసులు

కర్నూలు క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బంగారు వ్యాపారి షేక్ ఇజహర్ అహ్మద్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ బాబుప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన సీఐ పార్థసారథితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. రాధాకృష్ణ థియేటర్ సమీపంలో ఈనెల 1వ తేదీన సాయంత్రం 7గంటలకు ఇజహర్ అహ్మద్ తన తండ్రి నిసార్ అహ్మద్‌తో కలిసి నమాజుకు వెళ్లాడు. మసీదు నుంచి బయటకు రాగానే వన్‌టౌన్ గనిగల్లీకి చెందిన ఇమ్రాన్, ఇర్ఫాన్, షేక్ జాహీన్ అహ్మద్ ఆలియాస్ జహంగీర్, ఎస్ఎండీ ఇర్ఫాజ్, యూసుఫ్‌తో కలిసి దాడి చేశారు. పాత గొడవలు, మనస్పర్థలు ఏర్పడటంతోనే ఇజహర్ అహ్మద్‌ను హత్య చేయాలనే పథకంలో భాగంగా దాడిచేసి కత్తులతో గాయపరిచారు. ఇజహార్‌ను కర్నూలు ప్రభుత్వ ఆసు పత్రికి తరలించగా అదే రోజు రాత్రి 8 గంటలకు మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఇమ్రాన్, ఇర్ఫాన్, షేక్ జాహీన్ అహ్మద్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామన్నారు. నిందితుల నుంచి నేరానికి ఉపయోగించిన మూడు కత్తులను, బైక్‌ను స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో పీసీఆర్ సీఐ శివశంకర్, వన్‌టౌన్ ఎస్ఐ తిమ్మారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్మీడియట్ విద్యార్థి బలవన్మరణం

- హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక ఉరివేసుకున్న స్టూడెంట్



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్లో శ్యాంసుందర్ (ఫైల్)

డోన్ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక.. ఒంటరితనానికి గురైన ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకరమైన ఘటన పట్టణంలోని బీసీ హాస్టల్‌లో సోమవారం ఉదయం జరిగింది. వివరాలివీ.. అనంతపురం జిల్లా యాడికి మండలం చౌడేశ్వరి కాలనీకి చెందిన సావిత్రి, రమేశ్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు శ్యాం సుందర్ డోన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సం చదువుతున్నాడు. శ్యాంసుందర్ ఒంటరి స్వభా వంతో బాధపడేవాడు. రెండు నెలల క్రితమే హాస్టల్‌లో చేరాడు. తన భావాలను స్నేహితులతో పంచుకునేవాడు కాదు. సోమవారం ఉదయం వసతి గృహంలోని బాత్రూంలో ఉరివేసుకు న్నాడు. ఈ ఘటనతో విద్యార్థులు, కుటుంబ సభ్యులు శోకసంద్రం లో మునిగిపోయారు. అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా హాస్టల్‌కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామానికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎఫ్ఎస్ఎల్ టీమ్ కర్నూలు నుంచి వచ్చి ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాల ఫుటేజీలో అతను ఒంటరిగా బాత్రూమ్‌లో వెళ్లి అక్కడే ఉరి వేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందని సీఐ తెలిపారు.

విధుల్లో వార్డెన్ నిర్లక్ష్యం: బీజేపీ

హాస్టల్ వార్డెన్ విధుల్లో నిర్లక్ష్యం వహించారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి, బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య, నాగార్జున, ముదిరాజ్ లక్ష్మీనారాయణ ఆరోపించారు. సోమవారం స్థానిక పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో కనీసం వాచ్‌మెన్ కూడా లేకపోవడం దారుణమన్నారు. ఇలా విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌పై, మండల విద్యాధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేసి ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బరితెగించిన దుండగులు

- అంగన్‌వాడీ కేంద్రంలో బేడలు, నూనె చోరీ.. కోడిగుడ్లు ధ్వంసం

ఆస్పరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దుండగులు బరితెగించారు. ఆస్పరిలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో చోరీకి పాల్పడ్డారు. వివరాల మేరకు.. ఆదివారం రాత్రి తాళాలు పగలగొట్టి 26 కేజీల బేడలు, 7 లీటర్ల మంచినూనె ప్యాకెట్లను దొంగిలించి, కోడిగుడ్లను ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం గమనించిన టీచర్ నాగేంద్రమ్మ, ఐసీడీఎస్ జూనియర్ అసిస్టెంట్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా టీచర్లలో మనస్పర్థలు ఉండ టంతో ఇలా జరిగి ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు.



దుండగులు ధ్వంసం చేసిన గుడ్లు

వైసీపీ నేతలవి మొసలి కన్నీరు

- రైతులకు అండగా కూటమి ప్రభుత్వం
- కర్నూలు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ అజ్మత్‌బీ

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతుల విషయంలో వైసీపీ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని కర్నూలు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ అజ్మత్‌బీ విమర్శించారు. సోమవారం కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వైస్ చైర్మన్ శేషగిరిశెట్టితో కలిసి ఆమె మాట్లాడారు. వైసీపీ పాలనలో మద్దతు ధర కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు అండగా నిలిచిందన్నారు. రైతుల మనసులో విషం నింపే కుట్రలు వైసీపీ నాయకులు చేయడం దారుణమన్నారు. ఇటీవల తమ అనుచరులకు రైతుల ముసుగు వేసి కర్నూలు మార్కెట్ యార్డు వద్ద ధర్నా చేశారనీ, లేని ఆత్మహత్యాయత్నాలను సృష్టించారని ఆరోపించారు. మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన ఉల్లిని ఎప్పటికప్పుడు మార్క్‌ఫెడ్, వ్యాపారులతో కొనుగోలు చేయిస్తున్నామన్నారు. క్వింటానికి రూ.1,200 మద్దతు ధర అందించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని అన్నారు.ఉల్లి రైతులు సంతోషంగా ఉంటే వైసీపీ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా జత కలిపి తమ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడం సరైంది కాదన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అజ్మత్‌బీ

దొంగల అరెస్టు

- రూ.9.90 లక్షల విలువైన కేబుల్ వైర్లు స్వాధీనం

సంజామల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద అపహరణకు గురైన కేబుల్‌ను సంజామల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత నెల 23న రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించి రైల్వే లైన్ దగ్గర 420 కేజీల రాగి వైరు అపహరణకు గురైనట్లు ఎలక్ట్రికల్ మేనేజర్ జి.కృష్ణమూర్తి సంజామల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ రమణయ్య సిబ్బందితో ముమ్మర గాలింపు చేపట్టి దొంగలను పట్టుకున్నారు. 210 కేజీలు రూ.5.50 లక్షల విలువ చేసే రాగి వైరు, మరో 210 కేజీలు రూ. 4.40 లక్షలు విలువ చేసే 6.5 ఎస్క్యూఎంఎం వైర్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు: జేడీఏ

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణా దారులు యూరియా కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ పీఎల్ వరలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జేడీఏ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియాను అందజేస్తున్నట్లు తెలిపారు. ఎరువుల దుకాణాదారులు యూరియాను రైతులకు ఎమ్మార్పీకే అందజేయాలని, అధిక ధరలకు విక్రయించినా, యూరియాతో పాటు ఇతర ఎరువులను తీసుకోవాలని ఆదేశించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో 48,992 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. కొరత ఉంటే రైతులు టోల్ ఫ్రీ నెంబర్ 8341302863లో సంప్రదించాలని సూచించారు.

స్పందించిన సబ్ కలెక్టర్

మండలంలోని గుడికల్లు గ్రామంలో యూరియా కోసం రైతుల ఇబ్బందులపై సోమవారం ఆంధ్రజ్యోతిలో 'యూరియాతన' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ గుడికల్లు గ్రామంలోని రైతుభరోసా కేంద్రానికి ఏవో శివశంకర్, ఏఈవో నరసింహులు, ఆర్ఐ హఫీజ్‌ను పంపి విచారణ చేపట్టారు. రైతు గోవిందును తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి సబ్‌కెక్టర్‌తో మాట్లాడించినట్లు తహసీల్దార్ శేషఫణి తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ యూరియా పంపిణీలో అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. స్థానిక వ్యవసాయ అధికారులే యూరియాను కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని రైతులు చెబుతున్నారని అడగగా.. ఈ విషయంపై సబ్‌కలెక్టర్ విచారణ చేపడతారని చెప్పారు.

ఎంత కష్టం.. ఏమిటీ నిర్లక్ష్యం?

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- పసరువైద్యం కోసం పడిలేచి పోవాల్సిందే
- పట్టించుకోని అధికారులు, నాయకులు



గుంతలమయంగా ఉమాపతినగర్ రహదారి

రోడ్డలన్నీ గుంతలే.. వానొస్తే కుంటలే.. రాకపోకలకు సర్కస్ ఫీట్లే.. నిత్యం వాహనదారులకు అగచాట్లే.. ఆ దారిన వెళితే అవతారం మారాల్సిందే.. ఇదేదో మారుమూల కుగ్రామానికి వెళ్లే రహదారి కాదండోయ్.. పసరు వైద్యానికి ప్రసిద్ధిగాంచిన ఉమాపతి నగర్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి ఇది... అలాగే తిమ్మాపురం నుంచి జమాలయ్య దర్గాకు వెళ్లే రహదారి పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది.

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పక్షవాత నివారణ వైద్య కేంద్రంగా ప్రసిద్ధిగాంచిన ఉమాపతినగర్‌కు వెళ్లాలంటే ప్రజలకు నరకయాతనే. అసలే రోగులు ఆపై గుంతలమయమైన రహదారిలో వైద్యం కోసం వెళ్లాలంటే పడిలేచి పోవాల్సిన పరిస్థితి నెలకొంది. దొర్నిపాడు మండలం ఉమాపతి నగర్‌లో గుర్రం పిచ్చయ్యచౌదరి పక్షవాత నివారణ కేంద్రం ఉంది. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. గుండుపాపలనుంచి ఉమాపతినగర్ మధ్య రహదారి శిథిలావస్థలో ఉండటంతో వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు 3కి.మీ మేర ఈ రహదారి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. పక్షవాత రోగులను ఈ రహదారివెంట వైద్యం కోసం తీసుకువెళ్లాలంటే కష్టంగా మారింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యానికి ఈ రహదారి నిదర్శనంగా చెప్పవచ్చు. అలాగే మహానంది మండలంలోని తిమ్మాపురం నుంచి జమాలయ్య దర్గాకు వెళ్లే రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. మోకాటిలోతు గుంతలు ఉండటంతో వాహనాల్లో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ మంత్రితోపాటు మరో మంత్రి ఉన్నప్పటికీ రోడ్ల దుస్థితి ఇలా ఉండటంతో ప్రజలు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఆ గ్రామాల రహదార్లు బాగుపడతాయనుకున్న నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపట్ల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం గుంతలు పూడ్చే కార్యక్రమంలో కూడా ఈ రహదారుల పనులు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. జిల్లాలో దాదాపు రూ.10కోట్లతో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ఆర్అండ్‌బీ శాఖ చేపట్టింది. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉండే ఈ రహదారులకు మాత్రం కనీసం గుంతలు పూడ్చేందుకు కూడా నిధులు కేటాయించకపోవడం గమనార్హం. రాష్ట్రంతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలనుంచి పక్షవాత రోగులు ఉమాపతినగర్‌కు వైద్యం కోసం వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ ఆస్పత్రికి వెళ్లాలంటే రహదారి సరిగాలేకపోవడంతో అటు రోగులు, ఇటు ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు.



తిమ్మాపురం నుంచి జమాలయ్య దర్గాకు వెళ్లే రహదారి

రహదారితో తీవ్ర ఇబ్బందులు



ఉమాపతినగర్‌కు రహదారి సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గుండంపాడునుంచి రహదారి 3కి.మీ అధ్వానంగా ఉంది. గుంతలమయమైన రహదారిపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి కనీసం గుంతలను అయినా పూడ్చాలి.

-గుర్రం హరిబాబుచౌదరి

ఈ ప్రభుత్వంలోనైనా రోడ్డు వేయాలి



ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా మా గ్రామానికి రహదారి వేస్తారనే ఆశతో ఉన్నాం. ఆర్అండ్‌బీ శాఖ మంత్రి స్పందించి ఉమాపతినగర్‌కు రహదారిని మరమ్మతులు చేయించాలి. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి ఉమాపతినగర్‌కు పక్షవాత వైద్యం నయం చేయించుకునేందుకువచ్చే రోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

- చల్లా చంద్రశేఖర్‌రెడ్డి

బస్సుల కోసం విద్యార్థుల ఆందోళన



విద్యార్థులు, గ్రామస్థులతో మాట్లాడుతున్న ఏఎస్ఐ

పగిడ్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాలల సమయానికి బస్సులు నడపాలని మండల పరిధిలోని లక్ష్మపురం గ్రామానికి చెందిన విద్యార్థులు సోమవారం బస్సులు నిలిపివేసి ఆందోళన చేపట్టారు. బస్సులు సమయనికి రాకపో వడంతో కళాశాలలు, పాఠశాలకు ఆలస్యమవుతోందన్నారు. ఆర్టీసీ అధికారులు ఇక్కడికి వచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థులు పట్టుబట్టారు. దీంతో సుమారు గంటకు పైగా వాహ నాలను అడ్డుకున్నారు. ముచ్చుమర్రి ఏఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడ తామని పేర్కొనడంతో ఆందోళన విరమించారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కొత్తపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నక్కస్వాములు, మండల కార్యదర్శి హనుమంతు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో ఎంపీడీవో మేరీకి వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం యేసురత్నం మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.6వేలు వేతనాల్లో 20 నెలల పెండింగ్ వేతనాలు కూడా రావాల్సి ఉందన్నారు. కార్మికులతో అధికారులు వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలు పూర్తి స్థాయిలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు రాజారావు, శ్రీరాములు, రంగస్వామి, వెంకటేశ్వర్లు, శిఖామణి పాల్గొన్నారు.

వాహనమిత్ర రూ.25 వేలు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేసి రూ. 25వేలు ఇవ్వాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు చైన్‌సింగ్ నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్ల కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. అనంతరం జేసీ విష్ణు చరణ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా ఫిజియోథెరపీ డే

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నంద్యాలలోని ఫిజియోథెరపిస్టుల సంఘం కార్యాలయంలో సోమవారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నంద్యాల ఫిజియోథెరపిస్టుల సంఘం ప్రతినిధులు జగదీశ్వర రెడ్డి, రోహిణి విజయ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడు డాకర్ రవికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీనియర్ ఫిజియోథెరపీ వైద్యులు శివబాలిరెడ్డిని సత్కరించారు. ఆపరేషన్ ముందు, తర్వాత ఫిజియోథెరపి అవసరమని, దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం ఫిజియోథెరపీనే అన్నారు.

విద్యార్థులకు చేయూత

పాణ్యం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాను విద్యనభ్యసించిన పాఠశాలకు వడ్డుగండ్ల గ్రామనివాసి మురళీశర్మ సాయం అందించినట్లు ఎంఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. పాణ్యం మండలం, వడ్డుగండ్ల గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న మురళీశర్మ అమెరికాలో నివాసముంటున్నారన్నారు. సోమవారం రూ.15 వేల విలువైన కాపీ నోట్స్ పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, 10 కుర్చీలు అందించారన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

పాములపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం కస్తూర్బా పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

పదవీవిరమణ తప్పనిసరి: ప్రతి ఉద్యోగికీ పదవి విరమణ తప్పనిసరి అని ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి అన్నారు. కస్తూర్బా పాఠశాలలో పదవీ విరమణ పొందిన వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ తిరుపతిదేవి, నైట్ వాచ్‌మెన్ ప్రభావతిలను సన్మానించారు.

రేషన్ బియ్యం స్వాధీనం.. లారీ సీజ్



అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలు

మహానంది, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి రేషన్ బియ్యం లోడ్‌తో ఉన్న లారీని నంద్యాల సివిల్ సప్లయీస్ డీఎస్‌వో శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది సీజ్ చేశారు. గ్రామంలోని ఒక ఇంటిలో రేషన్ బియ్యం నిల్వలను అక్రమంగా నిల్వ ఉంచి లారీలో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు తరలించడానికి సిద్ధం అవుతుండగా సమాచారం అందుకొన్న సివిల్ సప్లయీస్ అధికారులు దాడులు నిర్వహించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని 250 బియ్యం బస్తాల లోడ్‌తో ఉన్న లారీని సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న లారీని నంద్యాలకు తరలించారు. కార్య క్రమంలో నంద్యాల సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్ రవి బాబు, వీఆర్వో జయరాముడు పాల్గొన్నారు.

ఇమాంలు, మౌజన్లకు గౌరవ వేతనం చెల్లించాలి



జేసీ విష్ణుచరణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇమాంలు, మౌజన్లకు గౌరవ వేతనం చెల్లించాలని వైసీపీ ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మీల్ అమీర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నూనెపల్లె ఉదయానంద హోటల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఇమాంలు, మౌజన్లతో కలిసి ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం జేసీ విష్ణు చరణ్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర మాజీ మైనార్టీల సలహాదారుడు హబీబుల్లా నాయకులు మాబున్నీసా పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం



వెంకటసుబ్బయ్యను సత్కరించిన ఉపాధ్యాయులు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత వెంకటసుబ్బయ్యను పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీఎస్ చలపతి, కార్యదర్శి డీవీ వరప్రసాద్‌రెడ్డి, జిల్లా మాజీ ఎస్టీఎఫ్ కార్యదర్శి శివకుమార్‌ల ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు.

మనిషి జీవితానికి విద్యతో వెలుగు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రగతి

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్య మనిషి జీవితానికి వెలుగు లాంటిదని శ్రీ రామకృష్ణ కళాశాలల డీన్ ఆఫ్ అకడమిక్స్ ప్రగతి అన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ నిర్వహించారు.డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనేక దేశాలు ఆర్థికంగా వెనుకబడి ఉండడానికి కారణం అక్షరాస్యత లేకపోవడమేనన్నారు. ప్రిన్సిపాల్ కేబీవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

జ్వరాల నుంచి ప్రజలను కాపాడండి



నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

ఆత్మకూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో సీజనల్ జ్వరాల నుంచి ప్రజలను కాపాడాలని సీపీఎం నాయకులు రణధీర్, సురేంద్ర, ఇస్మాయిల్, జబివుల్లా పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి మున్సిపల్ కమిష నర్ రమేష్ బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆ పార్టీ నాయకులు నూర్ అహ్మద్, సలీం, రమణ, సామేలు, మల్లయ్య, పుల్లయ్య, సలీం, అలీ, పారూక్, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

రణభేరి జాతాను జయప్రదం చేయండి

ఆత్మకూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై ఒత్తిడిని తగ్గించి బోధనేతర కార్యక్రమాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు తలపెట్టిన రణభేరి జాతాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. సోమ వారం ఆత్మకూరులో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూల్యాంకన ప్రక్రియను పాతపద్ధతిలోనే జరపాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆ సంఘం నాయ కులు బాలాజీరావు, నిజామొద్దీన్, అమీర్ అహ్మద్, బొజ్జయ్య, శంకర్, నాగరాజు, రామకృష్ణ, రమణ, ఇక్బాల్ బాషా తదితరులు ఉన్నారు.

అన్నప్రసాద వితరణకు విరాళం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో నిత్య అన్నప్రసాద వితరణకు కర్నూలుకు చెందిన రాజశేఖరరెడ్డి రూ.100.116 విరాళంగా అందజేశారు. అలాగే హైదరాబాదుకు చెందిన గాయత్రీ దంపతులు రూ.1,00,116 అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షకుడు శివప్రసాద్ దాతలకు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలంమయ్యాయని ఏఈ సీఈఏ 3045 యూనియన్ ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకులు శరత్ కుమార్, మధు అన్నారు. సోమవారం నంద్యాలలో ఉమ్మడి కర్నూలు జిల్లా కార్మికులతో సమావేశం నిర్వహించారు.

రేపు అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు

నందికొట్కూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీ, ఆయా పోస్టులకు ఆత్మకూరులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో మంగవల్లి తెలిపారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నందికొట్కూరు మిడ్తూరు, పగిడ్యాల మండలాల్లోని 7 అంగన్వాడీ, ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరించామని, వారికి ఆత్మకూరు ఆర్‌డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్వ్యూకు వెళ్లే అభ్యర్థులు పదవ తరగతి, కులం, స్థానికత, ఆధార్, రేషన్ కార్డు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆమె తెలిపారు.

యూరియా సరఫరా చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరం మేరకు యూరియా సరఫరా చేయాలని సీపీఐ తాలుకా కార్యదర్శి ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాల యం ఎదుట ధర్నా చేపట్టారు. సరిపడా యూరియా అందించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఆ పార్టీ నాయకులు చాంద్‌బాషా, షబ్బీర్, సయ్యద్ పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రమైన కొత్తపల్లిలో మన గ్రోమర్ సెంటర్‌కు 11.98 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు ఏవో అమీరున్నిసా బేగం తెలిపారు. మండల టీమ్ పర్యవేక్షణలో రైతులకు యూరియా పంపిణీ చేస్తారన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాలకు కూడా యూరియా త్వరలోనే వస్తుందన్నారు.

పాణ్యం: మండలంలో యూరియా పంపిణీ ప్రశాంతంగా జరుగుతోందని ఎంఈఏ జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలమూరు, కొనిదేడు, కొత్తూరు, నెరవాడ, కందికాయపల్లి గ్రామాలలో యూరియా పంపిణీని పరిశీలించారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివుడు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు మాట్లాడారు. రాష్ట్ర కౌన్సెలర్స్ గోపాల్‌రావు, జయరాం, మహబూబ్ బాషా, రవిశంకర్‌రావు, జిల్లా నాయకులు మల్లెల పుల్లయ్య, శేషయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

ఏపీవో వసుధకు డాక్టరేట్



బండిఆత్మకూరు సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం బండిఆత్మకూరు ఏపీవో వసుధకు డాక్టరేట్ లభించింది. సోమవారం ద్రవిడ యూనివర్సిటీ నుంచి మెయిల్ ద్వారా ఆమెకు డాక్టరేట్ ఇచ్చినట్లు సమాచారం అందింది. గతంలో కడప జిల్లా రామాపురం, గాలివీడు, పెండ్లిమర్రి, టీ సుండుపల్లి మండలాల్లో సోషియాలజీ విభాగంలో ఆచార్య జానకిరామయ్య పర్యవేక్షణలో ఇందిరా క్రాంతి పథకం స్వయం సహాయక సంఘాలపై ఆమె పరి శోధనలు చేశారు. అందుకు గాను వసుధను డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. త్వరలోనే యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ అందుకోనున్నారు. వసుధకు డాక్టరేట్ దక్కటం పట్ల సహచర అధికారులు అభినందనలు తెలిపారు.

నూర్‌బాషా, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా దస్తగిరి



సీఎం చంద్రబాబుతో దస్తగిరి

నంద్యాల రూరల్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నం ద్యాలకు చెందిన దస్తగిరిని సోమ వారం ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ 1995 నుంచి టీడీపీలోనే కొనసాగుతున్నానన్నారు. 2000, 2025లో 27వ వార్డు కౌన్సిలర్‌గా కొనసాగినట్లు తెలి పారు. ప్రస్తుత తన కోడలైన జహనాబీ కౌన్సిలర్ గెలు పొందిందినట్లు పేర్కొన్నారు.. పార్టీలో శ్రమకు తగిన ప్రాధాన్యత దక్కడంపై ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు, రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో పార్టీ, దూదేకుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ప్రతి రైతుకూ పరిహారం చెల్లించాలి

పాములపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వర్షాలకు నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.40 వేల నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ సుభద్రమ్మకు వినతిపత్రం అందిం చారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మ్యాజిక్ డ్రైన్‌కు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. నందికొట్కూరు మండలంలోని కోనేటమ్మపల్లె నంద్యాల జిల్లాలోనే మొట్టమొదటి పైలెట్ ప్రాజెక్టైన మ్యాజిక్ డ్రైన్ నిర్మాణానికి ఎంపికైంది. సోమవారం ఎమ్మెల్యే మ్యాజిక్ డ్రైన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పల్లె ప్రగతికి, పరిశుభ్రతకు, పారిశుధ్యానికి పాతరేసిందన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులను లేక ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీలకు పెద్దపీట వేశామన్నారు. గ్రామాలలో మురుగు నీటి పారుదల, పరిశుభ్రత, పారిశుధ్యంపై దృష్టి సారించామన్నారు. ఇందులో భాగంగా భూగర్భ జలాల పెరుగుదల, పారిశుధ్య నిర్వహణా భారం తగ్గడమే లక్ష్యంగా మ్యాజిక్ డ్రైన్‌ల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందన్నారు. దీని ద్వారా ప్రధానంగా పల్లెల్లో డ్రైన్ల నుంచి వచ్చే నీటిని కలుషితం చేయకుండా భూమిలోనే శుభ్రమై యింకిపోయేలా రూపొందించారన్నారు. ఫలితం గా గ్రామంలోని దోమలు, చెత్త, మురుగునీరు వంటి వ్యర్థపదార్థాల వల్ల వ్యాధులు ప్రబలకుండా ఈ మ్యాజిక్ డ్రైన్‌లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రానథరెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ పథకం ఏపీడీ ఏసుదాసు, ఈఓ ఆర్‌డీ రంగనాయక్, ఏపీఓ అలివేలు మంగమ్మ, గ్రామ సర్పంచ్ దామోదరెడ్డి, పీఎస్ అనురాధ, వీఆర్వో పవిత్ర తదితరులు పాల్గొన్నారు.



కోనేటమ్మపల్లెలో మ్యాజిక్ డ్రైన్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పేదలకు వరం సీఎం సహాయ నిధి

నందికొట్కూరు: పేదల పాలిట ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం లాంటిదని గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం పట్టణంలో పది మంది బాధితుల ఇళ్లకు వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్‌లో ఎం.వెంకటశివప్పకు రూ.49,295, కోటావీధిలోని జి.మణెమ్మకు రూ.2,65,025, రాములవీధిలోని కె.వెంకటేశ్వరమ్మకు రూ.54,995, బొంగుల బజార్‌లో షేక్ ఇషాక్‌కు రూ.84,583, గాంధీనగర్‌లో చంద్రకాంతి మధులతకు రూ.85,558, సుబ్బారావుపేట లో ఎం.యశ్వంత్‌కు రూ.26,200, సాయిబాబ పేటలో నీలి వేణుగోపాల్‌కు రూ.2,09,950, షేక్ కరిముల్లాకు, రూ.1,61,845, చిలకల రాజశేఖర్‌కు రూ.55,786, హెచ్‌బి కాలనీలో సంపంగి సంజయ్ కుమార్‌కు రూ.30,000 చెక్కులను అందజేశారు. పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నందికొట్కూరు మండలాధ్యక్షుడు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, నంది కొట్కూరు సహకార సొసైటీ చైర్మన్ ముర్తుజావళి, పట్టణ నాయకులు లాయర్ జాకీర్, జమీల్, రసూల్, వేణుగోపాల్, వడ్డె శ్రీనివాసులు, లింగస్వామి, మల్లికార్జునరెడ్డి, ఆర్షు శ్రీనివాసులు, మహిళా నాయకు రాళ్లు అనురాధ, మీనాక్షిదేవి, తదితరులు పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న ఎమ్మెల్యే

నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వీసీలో ఎమ్మెల్యే జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజినవేముల, నాగటూరు, పాములపాడు మండలం వేంపెంట గ్రామాల్లో ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూములకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని జేసీని కోరారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఘనంగా ఉమామహేశ్వరస్వామి పల్లకీసేవ



యాగంటిలో పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామివారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఈవో పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలి



జిల్లాస్థాయి ఉత్తమ హెచ్‌ఎంను సన్మానించిన ఎంఈవో, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రుద్రవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడు దిక్సూచిలా పని చేస్తారని ఎంఈవో వీర రాఘవయ్య అన్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు పొందిన నాగులవరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుదర్శన్‌ను సోమవారం ఎంఈవో, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలరు భార్గవరామయ్య, కస్తూర్బా ఎస్‌వో లక్ష్మీదేవి, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

కౌలు ఆదాయం తగ్గింది

రుద్రవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరూరు గ్రామంలోని ఈశ్వర, ఆంజనేయ, రామస్వామి దేవాలయాల మన్యం భూములకు సోమవారం దేవదాయ శాఖ అధికారులు కౌలు వేలం నిర్వహించారు. గతేడాది రూ.7.31లక్షలు ఆదాయం రాగా, ప్రస్తుతం రూ.6.12లక్షలు మాత్రమే ఆదాయం వచ్చింది. రూ.1.19లక్షలు ఆదాయం తగ్గింది. దేవదాయశాకాధికారులు వేలం వేయడంలో నిర్లక్ష్యం చేయగా కలెక్టరు రాజకుమారి ఆదేశాలతో పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించాల్సి వచ్చింది. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కార్తీక్, ఈవో సాయి జయచంద్రారెడ్డి, సీఐ దస్తగిరిబాబు, ఎస్‌ఐ మహ్మద్‌రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

రుద్రవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల దుకాణదారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో సుమతి హెచ్చరించారు. సోమవారం రుద్రవరం వ్యవసాయ కార్యాలయంలో ఎరువుల దుకాణ డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లు తప్పకుండా ఇవ్వాలని, స్టాకు బోర్డు, ధరల పట్టిక, బిల్లు బుక్కులు తప్పక ఉండాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏఈవోలు రాజు, ఫైమాత బుస్సుం తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడికతీత

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అహోబిలంలో డ్రైనేజీల్లో పూడిత తీత పనులు చేపట్టారు. అహోబిలంలో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు నీరు వీధుల్లోకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధిక వర్షాలు వచ్చినప్పుడు మురుగు నీరు ఇళ్లల్లోకి ప్రవేశించిన సంఘటనలు ఉన్నాయి. దాంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి ఎక్స్‌కవేటర్ సహాయంతో కాల్వలను శుభ్రం చేయించారు. మురుగు నిలిచి ఉన్న చోట వేస్ట్ ఆయిల్, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

ఐకమత్యంతో మెలగాలి: ఎస్‌ఐ



ఎస్‌ఐ రామిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బలిజ కులస్థులు ఐకమత్యంతో మెలగాలని ఎస్‌ఐ రామిరెడ్డి సూచించారు. సోమవారం బలిజ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా ఎస్‌ఐని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బలిజ కులస్థులు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్నారు. పిల్లలను బాగా చదివించాలన్నారు. కార్యక్రమయంలో బలిజ సంఘం జిల్లా కార్యదర్శి అర్జిగారి నరసింహుడు, గౌరవ అధ్యక్షుడు కమతం రాముడు, అధ్యక్షుడు ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, సాగునీటి సంఘం అధ్యక్షుడు చిన్న వెంకటసుబ్బయ్య ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఉండండి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం మాయలూరు రైతు సేవా కేంద్రంలో ఆయా ఆర్‌ఎస్కేల వీఏఏలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు నాటికి ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు. రబీకి అవసరం అయ్యే ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబా టులో ఉంచాలన్నారు. ఏఈవోలు రాణెమ్మ, సునీత ఉన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని ఏవో నాగేంద్రప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలో పర్యటించి పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. పంట నమోదుతోనే రైతులకు పంట విక్రయాలకు అవకాశం, ఎరువులు, ఇతర సబ్సిడీలు, అందే అవకాశం ఉంటుందని ఏవో సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, వీఏఏ సుబ్రమణ్యం, చిన్నయ్య, శాంతి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

అవుకు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు దేవరాజు అన్నారు. సోమవారం దివ్యాంగులతో కలసి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ ప్రతి దివ్యాం గుడికి అంత్యోదయ కార్డులను పంపిణీ చేసి, 35 కేజీల బియ్యాన్ని అందించాలన్నారు. 60శాతం వికలత్వం కలిగిన దివ్యాంగులకు త్రీవీలర్స్ స్కూటీలను ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో దివ్యాంగులకు కేటాయించిన నిధులను విడుదల చేసి ఖర్చు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగులు రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సురేష్, గుర్రప్ప, మధుబాబు పాల్గొన్నారు.

అధిక వర్షాలు.. తగ్గిన దిగుబడులు

● ఆందోళనలో మొక్కజొన్న రైతులు



ముత్తలూరు సమీపంలో రహదారిపై ఆరబోసిన మొక్కజొన్నలు

రుద్రవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాలు, వైరస్‌తో మొక్కజొన్న దిగుబడులు భారీగా తగ్గాయి. దీనితో అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. పంటల కోసం పెట్టిన పెట్టుబడులు సైతం రావడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. కొందరు వర్షాధారంగా, మరికొందరు తెలుగుగంగ, బోరుబావుల కింద 10800 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. వరి రైతులు కూడా మొక్కజొన్నను సాగు చేశారు. దిగుబడి బాగుంటుందని, మద్దతు ధర కూడా ఆశాజనకంగా ఉంటుందని, సాగు చేస్తే అధిక వర్షాలు, వైరస్ కారణంగా నిరాశ చెందాల్సి వచ్చింది. చిత్తరేణిపల్లె, ముత్తలూరు తదితర గ్రామాల పరిధిలో కోతలు ప్రారంభమయ్యాయి. గతేడాది ఎకరాకు 45 క్వింటాళ్ల దిగుబడి రాగా, ప్రస్తుతం 28నుంచి 30 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఎకరాకు 15క్వింటాళ్ల దిగుబడి తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒక్కో ఎకరాకు రూ. 30వేల నుంచి రూ. 40వేల వరకు పెట్టుబడులు పెట్టామని, దిగుబడి తగ్గడంతో ఆదాయం తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు 30క్వింటాళ్ల దిగుబడి



తాను రెండెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. గత ఏడాది ఎకరాకు 45నుంచి 50 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అధిక వర్షాల కారణంగా ఈసారి 30క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఆదాయం తగ్గింది.

● ఆదినారాయణ, రైతు

దిగుబడి అంతంత మాత్రమే



కౌలు, పెట్టుబడి రూపంలో ఎకరాకు రూ.40వేల నుంచి రూ.50వేలు పెట్టాను. ఒక ఎకరాకు 28 నుంచి 30 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. ముందస్తు సాగు చేసినా దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది.

- రేవంత్, రైతు

జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి


● జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖరావు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్‌రావు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వైరల్ ఫీవర్స్ అధికంగా నమోదవుతున్నందున వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారిచంద్రశేఖరావు ఆదేశించారు. సోమవారం కొలిమిగుండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్, డెలివరి గదిని పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విశ్వనాథ్, సీహెచ్‌వో పరమేశ్వరరెడ్డి, స్థానిక వైద్యులు హరిచరణ్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లిపై వైసీపీ రాజకీయం తగదు: సుబ్బారెడ్డి



కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలు గమనిస్తున్నారని, వైసీపీ దుష్ప్రచారాలు మానుకోవాలని తెలిపారు.

డోన్ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపై వైసీపీ నాయకులు రాజకీయం చేయడం తగదని ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉల్లి రైతులను అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోలేదని అన్నారు. ఇప్పుడు పని లేకుండా కేవలం రైతులను అడ్డుపెట్టుకుని కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రస్తుతం క్వింటం ఉల్లిని రూ.1,200లకు కొనుగోలు చేస్తోందన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎలాంటి సమస్య లేకున్నా ఏదో ఉన్నట్లు సృష్టించడం వైసీపీ నాయకులకు సాటి లేరని ఎద్దేవా చేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి వితరణ



అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రిని అందిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్/ప్యాపిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలి మండలం సీతమ్మతండా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన ఆట వస్తువులు, కుర్చీలు, టేబుళ్లను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అందజేశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనసేనా నాయకురాలు రేణుకానాయక్ రూ.30వేలు విలువ చేసే సామగ్రిని వితరణ చేశారు. వీటిని అంగన్ వాడీ కేంద్రానికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా రేణుకా నా యక్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సీడీపీవో శంషా ద్ బేగం, జనసేన నాయకులు ఆలా మోహన రెడ్డి, లక్ష్మణ్ నాయక్, చి ట్యాల మద్దయ్య గౌడు, చనుగొండ్ల శ్రీరాములు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ అర్చకుడి మృతి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జ్వరంతో బాధపడుతూ కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ అర్చకుడు మృతి చెందాడు. మండలకేంద్రంలోని షిరిడీ సాయిబాబా ఆలయ ప్రధాన అర్చకులు రాంప్రసాద్‌కు ఐదు రోజులుగా జ్వరంతో బాధపడేవారు. దాంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. సాయిబాబా ఆలయంలో సుదీర్ఘ కాలం పాటు ప్రధాన అర్చకుడిగా సేవలందించారు. రాంప్రసాద్ మృతిపై ఉమ్మడి గనులు, భూగర్భ శాఖ రిటైడ్ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, వీడీ రామకృష్ణతో పాటు పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సంజామల,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంఈవో రమణా రెడ్డి హెచ్చరించారు. సోమవారం కమలపురి, వసంతాపురం, హోత్రమాన్‌దిన్నె పాఠశాలలను ఎంపీవో తనిఖీ నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో అటెండెన్స్ రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించారు. ప్రాథమిక విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల స్థాయికి తగ్గట్టుగా బోధించాలని సూచించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి: సీఐటీయూ



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, ఆటో డ్రైవర్లు

డోన్ రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరాం, మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లకు బాడుగలు తగ్గి ఉపాధిపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళనలు వ్యక్తం చేశారు. రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు నాగమద్దయ్య, రామాంజనేయులు, మద్దయ్య, చంద్ర, బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈగా రామ్మోహన్

దొర్నిపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దొర్నిపాడు విద్యుత్ శాఖ ఏఈగా రామ్మోహన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఏఈగా పని చేస్తున్న అనంతరావు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

- సీపీఐ నాయకుల డిమాండ్
- రెవెన్యూ కార్యాలయాల ముందు ధర్నాలు
- తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేత



బనగానపల్లె తహసీల్దారు నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

బనగానపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రైతులకు యూరియా కొరతలేకుండా చూడాలని సీపీఐ మండల కార్యదర్శి శివయ్య కోరారు. సోమవారం తహసీల్దారు నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువుల కృత్రిమ కొరతను అరికట్టాలన్నారు. కృత్రిమ కొరతను సృష్టిస్తున్న దుకాణాలను సీజ్ చేయాలని కోరారు. సకాలంలో యూరియా అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, శివ బాలకృష్ణ, శివనాగయ్య, ఖాదర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు తక్షణమే యూరియా అందజేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్, తహసీల్దార్ నాగమణి, వ్యవసాయాధికారి విజయ్ కుమార్ రెడ్డి, కమిషనర్ హరిప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, పట్టణ కార్యదర్శి సి.నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: మండలంలో యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి మోట రాముడు డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు రామ్మోహన్, పుల్లయ్య, పులిశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

అవుకు : రైతులకు సరిపడే యూరియాను అందించాలని పట్టణ సీపీఐ కార్యదర్శి నాగాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ మల్లికార్జునరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటరమణ, సుబ్బరాయుడు, రమేష్, సునీల్, రజాక్‌బాషా పాల్గొన్నారు.



బేతంచెర్ల ఏవో విజయకుమార్ రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు, రైతులు



అవుకులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

యూరియా పంపిణీ



యూరియాను పంపిణీ చేస్తున్న ఏడీ విజయ్‌కుమార్

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ ఏడీ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం బత్తలూరు గ్రామంలో 20 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు ఏడీ తెలిపారు. అలాగే పెద్దకందుకూరులో 20 మెట్రిక్ టన్నులు, ఎస్ లింగందిన్నెలో 12 మెట్రిక్ టన్నులు, పేరాయి పల్లెలో 66 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవో రాజ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వీహెచ్‌ఏ శ్రావణి అన్నారు. సోమవారం డి.వనిపెంట గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి 23 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు కాగా, పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ ఉమామహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా కలశ పూజలు



చాగలమర్రి పాత శివాలయంలో పూజలు చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, సెప్టెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని పాతశివాలయంలో సోమవారం సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో దంపతులు కలశస్థాపన, శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చెన్నకేశవ, కన్యకాపరమేశ్వరి, అయ్యప్ప, సాయి బాబా ఆలయాలతో పాటు వెల్లాల క్షేత్రంలోని చెన్నకేశవ, భీమ లింగేశ్వర ఆలయాల్లో ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో సంప్రోక్షణ చేశారు. అనంతరం స్వామివారి దర్శనం భక్తులకు కల్పించారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన ఉండాలని శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వ ర్‌రెడ్డి మాట్లాడుతూ అక్షరాస్యత ప్రాధాన్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయన్నారు. అధ్యాపకులు సంటిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, క్రిష్ణశశాంక పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత అందరి బాధ్యత

చాగలమర్రి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్ష రాస్యత అందరి బాధ్యత అని ఏపీఎం నాగమ్మ అన్నారు. సోమ వారం వెలుగు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఉల్లాస్ పథకం ద్వారా రెండో విడత కింద 40 మంది వీవోఏలకు, స్వచ్ఛంద వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. వలంటీర్లు నిరక్షరాస్యులైన పొదుపు మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. వెలుగు సీసీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక

చాగలమర్రి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్‌సెల్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్ర తెలిపారు. సోమవారం తహసీల్దార్ కా ర్యాలయంలో సమస్యలతో కూడిన అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

స్వమిత్ర సర్వే వేగవంతం

చాగలమర్రి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వమిత్ర సర్వేను సచివాలయ ఉద్యోగులు వేగవంతం చేయాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. నెల చివరి నాటికి సర్వే పూర్తి చేసి భూహక్కు పత్రాలు తయారు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రూ.30 వేలు చెల్లించాలి

శిరివెళ్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : పశుగ్రాసాన్ని పండించుకునేందుకు పాడి రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30 వేలు చెల్లించాలని నంది పాడిపంట రైతు పరిరక్షణ సమితి అధ్యక్షుడు గురజాల మనోజ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శిరివెళ్ల మెట్ట వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయానికి అవసరమైన ఎరువుల తయారీకి రైతులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కల్లూరి శేష కృష్ణారెడ్డి, మస్తాన్, మదార్, మూగన్న, రాజు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగులకు అన్నదానం

బేతంచెర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు, రోగులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గొల్ల మల్లేశ్వరమ్మ జ్ఞాపకార్థం భర్త గొల్ల వెంకటరమణ కుమారులు జయకృష్ణ, చంద్రమౌళి సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురా మధు సుధాకర్ రెడ్డి, కోడే వెంకటేశ్వర్లు వలిబాషా, మనోహర్‌రెడ్డి, కుప్ప శ్రీనివాసులు, కేశాల్ నాయుడు, వన్నూరు సాహేబ్, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ తహసీల్దారుగా ప్రసాదుబాబు



ఉయ్యాలవాడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా ప్రసాదుబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి తహసీల్దార్ సువర్ణాదేవి కలెక్టరెట్‌కు బదిలీ అ య్యారు. డీటీ ప్రసాదుబాబు పదోన్న తి పొంది తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా సుబ్రమణ్యం

రుద్రవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జి ఎంపీడీవోగా సుబ్రమణ్యం నియమితులైయ్యారు. ఈ మేరకు సోమవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఎంపీడీవో భాగ్యలక్ష్మి శిక్షణ నిమిత్తం నెలరోజులు శ్రీకాళహస్తికి వెళ్లారు.

రేషన్ దుకాణాలు తనిఖీ

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం, కొలిమిగుండ్ల, నాగిశెట్టిపల్లె, ఎర్రగుడి, హనుమంతుగుండం గ్రామాల్లోని రేషన్ దుకాణాలను సివిల్‌సప్లయ్ బనగానపల్లె అధికారులు తనిఖీ చేశారు. అనుమానం కలిగిన పలు చౌక దుకాణాల్లోని ఈ-పాస్ యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఇన్‌చార్జి తహసీల్దారుకు డెంగీ

రుద్రవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జి తహసీల్దార్ చంద్రశేఖరయ్యకు డెంగీ జ్వర లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. దాంతో ఆయన సెలవులో వెళ్లారు. ప్రస్తుతం వైద్యం పొందుతున్నట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు.